క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

గట్టు: మండలంలోని బోయలగూడెం గ్రామానికి చెందిన వెంకటమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.18 వేలు మంజూరయ్యాయి. దీంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు గద్వాల తిమ్మప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్‌-కొత్త బస్టాండ్ మధ్య ఉన్న వాగుపై నూతనంగా నిర్మించే బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణంలోని టౌన్ 1 ఫీడర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టారు. అంబేడ్కర్ చౌక్, పాత పోలీస్ స్టేషన్, దుర్గనగర్, మాలపేట, పాతబస్టాండ్ కాలనీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

యువత సన్మార్గంలో నడవాలి



ధరూరు: యువత సన్మార్గంలో నడవాలని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చి, మరనాథ విశ్వాస సమాజ మందిరం, హోసన్నా మందిరం, కల్వరి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలు బైబిల్ ఆధారంగా బోధించారు. అనంతరం బల్లారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రభాకర్, సుదర్శన్ అబ్రహం, కృపరాజ్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మోస్తారు వర్షం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాలతోపాటు, మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొందరు 15 రోజుల కిందట కురిసిన తొలకరి వర్షానికి పత్తి, కంది సాగు చేశారు. అప్పటి నుంచి వర్షాలు పడక మొక్కలు ఎండదశకు చేరాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో పత్తి, కంది పంటకు కొంతమేర ఉపశమనం లభించింది. మరికొన్ని చోట్లు సోమవారం విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా మోస్తారు వర్షం కురవడంతో రాత్రి వేళ గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వినియోగదారులు అవస్థలు పడ్డారు. గ్రామాల్లో కూడా నిత్యం ఇదే పరిస్థితి దాపురించిందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమలు, ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై అధికారులు స్పందించి విద్యుత్ లైన్లు సరిచేసి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పలుచోట్ల చిరుజల్లులు

రాజోళి: మండలంలో పలు చోట్ల చిరుజల్లులు కురిశాయి. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి మేఘావృతమై వాతావరణ చల్లబడింది. వర్షాకాలం ప్రారంభమై నెల దాటినా ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూడుకుపోతున్న చెరువు కాల్వ



అమరచింత: అమరచింత పెద్ద చెరువును 15ఏళ్ల కిందట లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే సంకల్పంతో నిర్మించగా, ప్రస్తుతం పూడుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే నిధుల ద్వారా కాల్వ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహార పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వ పూర్తయ్యింది. 12 ఏళ్లుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలక పోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు కమ్ముకున్నాయి.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- వ్యాప్తి చెందుతున్న క్రిమి, కీటకాలు
- దోమల నివారణకు చర్యలు శూన్యం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో వర్షాల కారణంగా ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు కుంటలుగా మారుతున్నప్పటికీ సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు. ఆయా గ్రామాల్లో వర్షాలకు నిలిచిన నీరు, మిషన్‌భగీరథ పైపుల లీకేజీ నీరు మురుగుగా ఏర్పడి దోమలు, ఈగలకు నివాసాలుగా మారాయి. దీనికి తోడు ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ పాలకులు, అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు,



రోడ్డుపై పారుతున్న మురుగు



ఎర్రవల్లిలో మురుగుకుంట

దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతిని 15 రోజుల పాటు గతంలో నిర్వహించినా సమస్యలు తీరలేదని ప్రజలు అంటున్నారు. ఆయా గ్రామాలలో మురుగు రోడ్లపైనే ఇష్టానుసారంగా పారుతుంది. అక్కడక్కడ డ్రెయినేజీలు ఉన్నా సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం అయినా అధికారులు, పాలకులు స్పందించి దోమల నివారణకు ఎలాంటి ముందస్తు చర్యలను చేపట్టకపోవడంతో ప్రజలు నిద్రలేని రాత్రులను గడుపుతున్నారు.

ఫాగింగ్, బ్లీచింగ్‌ల జాడేలేదు...

వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆయా గ్రామాలలో వర్షపు నీరు మురుగు కుంటలుగా ఏర్పడింది.



కాలనీలో పందుల గుంపు

దీనికి తోడు ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా అంతర్గత రోడ్లు మురుగు నీటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. దీని ద్వారా కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు గుడ్లుపెట్టి విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు ఆయా గ్రామాలలోని పలు కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నారు. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీనిని తోడు డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతూ కుంటలుగా దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ సక్రమంగా వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా గ్రామాల్లో ఫాగింగ్ ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధ/ కారులు స్పందించి పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో సతమతమవుతున్నాం...



ఎర్రవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో వర్షపునీరు, మురుగు రోడ్లపై పారుతోంది. మురుగుకు తోడు మిషన్ భగీరథ నీరు ప్రవహించి కుంటలను తలపిస్తున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరగా సమస్యను పరిష్కరించాలి.

– రవికుమార్, గ్రామస్తుడు, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం...



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులు ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైనచోట, ఎక్కువగా జనాలు సంచరించే ప్రాంతాలలో ఫాగింగ్ చేపడతాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. ప్రజలు గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాన్ని వేయకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో మాత్రమే వేసి సహకరించాలి.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

ప్రమాదకరంగా మలుపులు



కుర్తిరావులచెర్వు మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న మలుపు



పెద్దొడ్డి - మల్దకల్ గ్రామాల మధ్య..

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రూ.50 వేలు అందజేత



ధరూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అల్వలపాడు గ్రామానికి చెందిన నాగేంద్ర కుటుంబ సభ్యులకు విశ్వ హిందూ పరిషత్ సభ్యులు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆదివారం విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రసార సమితి ఆధ్వర్యంలో పోగు చేసిన నగదును మృతుని భార్య, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఫణి మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు రంగన్న, సత్యన్న, మన్యపురెడ్డి, ప్రతాప్ రెడ్డి, పరమేష్, రామకృష్ణ, ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

మానవపాడు: ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మల్లికార్జున్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రైవర్లు ఐకమత్యంగా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ చట్టాన్ని సవరించి డ్రైవర్లకు ఉపయోగపడే విధంగా మార్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గుర్తుంపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కార్యదర్శి ఈశ్వర్, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, దుబ్బన్న, మాలిక్‌బాషా, నరేష్, అన్వర్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి, సాయిబాబా ఆలయాలను ఈ నెల 3న గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం పూలతో అలంకరించారు. విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పౌర్ణమి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందలు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పునీతులు కావాలని కోరారు.

వరుణుడి కోసం పూజలు



కృష్ణానది జలాలను తీసుకొస్తున్న యాపదిన్నె గ్రామస్తులు

అయిజ: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని యాపదిన్నె గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కాడెద్దులు, ఎడ్లబండితో బీచుపల్లి పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు అక్కడే రాత్రి నిద్రించి ఆదివారం కృష్ణానదిలోని పవిత్ర జలాలను గ్రామానికి తీసుకొచ్చారు. భాజాభజంత్రీలు, డప్పుల శబ్దాలు, భజనల మధ్య పవిత్ర జలాలను ఊరేగించారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, మహాశివునికి, గ్రామ దేవతలైన పెద్దమ్మ, కర్రెమ్మ, సుంకులమ్మ, సవారమ్మ, ఈదమ్మ, జమ్ములమ్మ దేవతామూర్తులకు పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని నడిమిపేట 20వ వార్డులో కౌన్సిలర్ హుస్సేన్‌బీ, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మహిళా రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేష్, మహిబూబ్‌పాషా, ఆయా వార్డులకు చెందిన మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని శివారు జాతీయ రహదారిపై మదనపల్లి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలైన విషయం విదితమే. బాధితులు కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు అనంత రాజరాము ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

వరద బాధితులకు ఇళ్లు ఇవ్వాలి



సమస్యలపై చర్చిస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: వరదల కారణంగా 2009 సంవత్సరంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఇళ్లు నిర్మించాలని సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు ఇళ్లు లేకపోవడంతో అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు బాధితులకు ఇళ్లు నిర్మించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూడా సకాలంలో బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బొజ్జన్న, మంజునాథ్, మారెప్ప, కృష్ణ, లక్ష్మన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం



కల్వర్టు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

శాంతినగర్: కల్వర్టుల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం శివారులోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వ డీ–27 పరిధిలో 2.9, 3.3, 3.9 కిలోమీటర్ల వద్ద మూడు చోట్ల నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల్వకు ఇరువైపులా ఉన్న రైతులకు ఇబ్బందులు తొలగించేందుకు కల్వర్టులు నిర్మిస్తున్నారన్నారు. పనులు వేగవంతంగా, నాణ్యతగా చేపట్టి రైతులకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మూడు కల్వర్టులకు సంబంధించి రూ.22 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖర్, మహేష్, ఆర్డీఎస్ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అలంపూర్: బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం మేర బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లో ఎన్నికలు ఉంటాయని కమిటీలో ఉన్న బాధ్యులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వపు బూటకపు హామిలు, అప్పులు, అవినీతి ప్రజలకు వివరించాలన్నారు. విస్తారక్‌లు భాగ్యలక్ష్మి, సుగుణ, ప్రశాంత్, సంతోషలు బూత్ కమిటీలను పర్యవేక్షించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బంగిలక్ష్మణ్, నాయకులు నాగమద్దిలేటి, జగన్‌మోహన్ రెడ్డి, వెంకటేష్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మేరా బూత్ సబ్సే మజ్బూత్ మహాజన్ సంపర్క అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంతో పాటు యాపదిన్నెలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, పోలింగ్ బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి విజయ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఇంటింటికి బీజేపీ కార్యక్రమానికి వడ్డేపల్లికి మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన అల్పకాలిక్ విస్తారకులు శశిధర్ దిండూర్, నజీర్‌లను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, వెంకటేష్, రాజశేఖర్‌గౌడ్, సంజన్న, జగన్‌గౌడ్, శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ నాగేష్ అన్నారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. పథకాలను ఎలా లబ్ధిపొందాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, కృష్ణయ్య, హనుమంతు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు, జింకలపల్లి పోలింగ్ బూత్‌లలో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్ణాటక విస్తారక్ మంజునాథ్ హాజరయ్యారు. అనంతరం కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేకేరెడ్డి, మానిక్యరెడ్డి, అశోక్, మద్దిలేటి, జనార్దన్‌రెడ్డి, గోపాల్, శ్రీకాంత్, బూత్ కమిటీ సభ్యులు, ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో సంబురపడ్డారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో, చేసే పనిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు డీజే మైక్‌సెట్‌ను అందించారు. అదేవిధంగా పూర్వ విద్యార్థి శివప్ప పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాధిక్, ప్రసాద్, జయరాం, యుగేందర్, సతీష్, మద్దిలేటి, సుజాత, రాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి

అయిజ: పార్టీ కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డులో వార్డ్, బూత్ లెవల్, మహిళా కమిటీలను నియమించారు. ముఖ్య అతిథిగా షేక్షావలి ఆచారి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనను ప్రజలకు తెలియజేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి, డీసీసీ ఉపాధ్యక్షుడు గిత్తల దేవరాజు, మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షురాలు సులోచనమ్మ, టౌన్ ప్రసిడెంట్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.